నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వెంకట్‌ప్లాజా, ఒబ్రా జ్యువెలర్స్, కృష్ణా జ్యువెలర్స్, ఎక్సైడ్ బ్యాటరీ లేన్, అపరాజిత కాలనీ, ఎంసీహెచ్ మార్కెట్, ఎస్సార్టీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

రేపు జెక్ కాలనీలో ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం

సనత్‌నగర్: జెక్‌కాలనీ స్ట్రీట్ నెంబర్–1లోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్‌లో ఆదివారం ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ నాగరాజు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వైద్య శిబిరంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు జరపనున్నట్లు తెలిపారు. ఈఎన్‌టీ సర్జన్ రాధ హాజరై ఈ పరీక్షలు నిర్వహించడంతో పాటు పలు సూచనలిస్తారన్నారు.

బేగంపేట ఇన్‌స్పెక్టర్‌గా ప్రసాదరావు



సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదన ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన చిర్రా రామయ్యను రాష్ట్ర సచివాలయంలోని సెక్యూరిటీ వింగ్‌కు బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో 2007 బ్యాచ్‌కు చెందిన బి.ప్రసాదరావును స్పెషల్ బ్రాంచ్ నుంచి బేగంపేటకు బదిలీ చేశారు. ప్రసాదరావు నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని అబిడ్స్, బంజారాహిల్స్ ట్రాఫిక్ విభాగాల్లో కూడా పనిచేశారు.

ఎన్‌సీసీ డిప్యూటీ డైరక్టర్ జనరల్ పదవీ విరమణ



రసూల్‌పురా: ఎన్‌సీసీ నుంచి పదవీ విరమణ పొందినప్పటికీ రానున్న రోజుల్లో ఎన్‌సీసీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని ఎన్‌సీసీ డిప్యూటి డైరెక్టర్ జనరల్ వి. మధుసూదన్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్‌లోని తెలంగాణ, ఆంధ్ర ఎన్‌సీసీ డైరక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం మధుసూదన్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా త్రివిధ దళాల ఉన్నతాధికారులు ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

కుట్టు మిషన్ల పంపిణీ

అమీర్‌పేట: అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి టైలర్స్ డే సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఎస్‌ఆర్‌నగర్ ఈడబ్ల్యూఎస్ కాలనీలోని మానస లేడీస్ టైలర్ షాపులో పనిచేసే ఇద్దరు మహిళలకు శుక్రవారం మిషన్లు పంపిణి చేశారు కార్యక్రమంలో స్థానిక నాయకులు కూతురు నర్సింహ,రాము యాదవ్,లత,దుర్గా,ఝాన్సీ,స్వప్న, సుప్రియ పాల్గొన్నారు.

‘మానసిక ఆరోగ్యం’పై శిబిరం రేపు

సనత్‌నగర్: బ్రహ్మకుమారీస్ ఎస్సార్‌నగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మార్చి 2న యువత కోసం ‘మానసిక ఆరోగ్యం’పై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఎస్సార్‌నగర్ బాపునగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో మానసిక నిపుణులు, మనస్తత్వవేత్తలు, కౌన్సెలర్లు పాల్గొని మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు తెలిపారు.

సెల్ ఫోన్ దొంగల అరెస్టు



అమీర్‌పేట: సెల్ ఫోన్లు మాయం చేస్తున్న ఇద్దరు యువకులను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. మెదక్ జిల్లాకు చెందిన స్నేహితులు కట్ట నవీన్, విట్టల రాజులు సెల్ ఫోన్ల చోరీకి పాల్పడుతున్నారు. ఎస్‌ఆర్‌నగర పోలీస్ స్టేషన్ పరిధిలోని హాస్టళ్లలో ఒకే రోజు 12 సెల్ ఫోన్లను దొంగిలించారు. దర్యాప్తు జరిపిన పోలీసులు నిందితులను అరెస్టుచేసి 28 ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

సర్వం సమస్యలమయం పట్టించుకునే వారెవరు?

సమస్యలతో ప్రారంభమవుతున్న రంజాన్ మాసం

మసీదుల వద్ద ఏర్పాట్లు మరచిన అధికారులు



బేగంపేటలో మసీదు వద్ద ప్యాచ్‌వర్కులు చేయని దృశ్యం



బేగంపేట ప్రకాష్‌నగర్‌లో మురుగునీరు

రంజాన్ మాసం..ముస్లింలకు అతి పవిత్రమైన మాసం. నెలంతా కఠోర ఉపవాస దీక్షలు బూని భక్తిని చాటుకుంటారు. ఈ క్రమంలో ప్రభుత్వం తరుపున కూడా ప్రతియేటా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ఆనవాయితీగా వస్తోంది. రంజాన్ మాసం ప్రారంభమవుతుందంటే చాలు.. మసీదులు, ఈద్గాల వద్ద పరిస్థితులపై అధ్యయనం చేసి ఏమైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ వస్తుంటారు. కానీ ఈ సారి రంజాన్ ఏర్పాట్లపై సమావేశాలు, సమీక్షలు జరగక్కుండానే రంజాన్‌మాసం ప్రారంభమవుతోంది – సనత్‌నగర్

రంజాన్ మాసంలో ప్రధానంగా మసీదుల వద్ద విద్యుత్ లైట్ల ఏర్పాటుతో పాటు మంచినీటి సౌకర్యం, పారిశుధ్యం తదితర అంశాలపై దృష్టి పెడతారు. సమీపంలో ఎక్కడైనా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయేమో అనే అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

◆ సనత్‌నగర్ నియోజకవర్గంలోని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట డివిజన్లలోని మసీదు కమిటీ ప్రతినిధులతో ప్రతి సంవత్సరం అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకునేవారు. అందుకు అనుగుణంగా మసీదు కమిటీ చెప్పిన సమస్యల పరిష్కారానికి అవసరమైతే ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక నిధులను మంజూరు చేయించేవారు. ఈ సారి ఎందుకో.. రంజాన్ ఏర్పాట్లపై సమీక్షలు, సమావేశాలు జరకుండానే గడిచిపోతుంది. ఫలితంగా పలు మసీదుల వద్ద కొన్ని సమస్యలు వేధిస్తున్నాయని ముస్లిం సోదరులు వాపోతున్నారు.

ప్రత్యేక ఏర్పాట్ల ఊసే లేదు..

ముఖ్యంగా తెల్లవారుజామున, రాత్రి వేళల్లో నమాజ్‌తో పాటు ఇఫ్తార్ విందులు నిర్వహణ దృష్ట్యా లైట్ల ఏర్పాటు చేస్తుంటారు. ఒక్కో డివిజన్‌లో 200–300 లైట్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసేవారు. ఆ ఇంకా లైట్ల ఏర్పాటు జరగలేదు. పోనీ వీధిదీపాల గురించి పట్టించుకుంటున్నారా? అంటే అదీ లేదు. చాలాచోట్ల వీధిలైట్లు వెలగడం లేదు.

◆ రంజాన్ మాసం వచ్చినా ఎక్కడెక్కడ వీధిలైట్లు వెలగడం లేదో పరిశీలించి వాటిని పునరుద్ధరించాల్సిన అధికారులు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రాత్రివేళల్లో, తెల్లవారుజామున మసీదులకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. రంజాన్ మాసంలో ఎక్కువ సేపు మసీదుల్లోనే గడిపే పరిస్థితులు ఉంటాయి.

◆ మసీదుల్లో మంచినీటి వసతిని కల్పించాల్సిన అవసరం ఉంది. పైప్‌లైన్ల ద్వారా సరఫరా అయ్యే నీరు ఏ మూలకూ సరిపోక ఇబ్బందులు పడే పరిస్థితులు ఉంటాయి. అందుకోసం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. దీనిపై కొన్ని మసీదు కమిటీలు వాటర్‌వర్క్స్ అధికారులకు విన్నవించుకుంటున్నా ఆశించిన స్థాయిలో స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ పారిశుధ్య సమస్య అత్యంత ప్రధానమైనది. మసీదు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రతియేటా చర్యలు తీసుకునేవారు. కానీ ఈ సారి కనీసం మసీదుల వద్ద డస్ట్‌బిన్లను కూడా ఏర్పాటు చేయలేదని పలువురు వాపోతున్నారు.

◆ పలుచోట్ల మసీదు సమీపంలో డ్రైనేజీలు పొంగుతున్నాయని, దుర్వాసనతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. రోడ్ల ప్యాచ్ వర్క్‌లు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, వాటి గురించి అసలు పట్టించుకోకపోవడంతో పలు ప్రాంతాల్లోని మసీదులకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా మారాయి.

◆ వసతుల కల్పనపై మసీదు కమిటీ ప్రతినిధులే కార్పొరేటర్లు, స్థానిక నేతల దృష్టికి తీసుకువెళ్లడమో, అధికారులకు విన్నవించుకోవడమో చేస్తున్నా అంతగా ఫలితం ఉండడం లేదని ఇంకొంతమంది వాపోతున్నారు. అధికారులు స్పందించి మసీదుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా కోరుతున్నారు.

గతంలో ముందుగా సమస్యలు తెలుసుకునేవారు



రంజాన్ మాసం వచ్చిందంటే సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించేవారు. ఆ పరిస్థితి ఈ సారి కనిపించలేదు. అలాగే జీహెచ్‌ఎంసీ తరుపున చెత్తను తరలించడానికి పెద్ద వాహనం వచ్చేది. అయితే ప్రైవేటు సంస్థకు కాంట్రాక్ట్ ఇవ్వడంతో ఈ సారి వస్తారా? లేదా?అనేది అనుమానమే. ప్రతిరోజూ మూడు వేల మంది వరకు మసీదుకు వస్తుంటారు. చెత్త కూడా భారీగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తరలించేలా ఏర్పాట్లు చేయాలి. అలాగే పార్కింగ్ సమస్య కూడా ఉంది. – సయ్యద్ నోమాయుద్దీన్, జాఫ్రీ మసీదు కమిటీ అధ్యక్షుడు, సనత్‌నగర్

సమావేశాల ఊసే లేదు



రంజాన్ మాసం ప్రవేశానికి కొన్ని రోజుల ముందు అధికారులతో మసీదు కమిటీ ప్రతినిధులతో సమావేశాలు జరిగేవి. సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకునేవారు. కానీ ఈ సారి సమావేశాల ఊసే లేదు. సమస్యలను తెలుసుకునే వారే లేరు. ముఖ్యంగా బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ మసీదు వద్ద నీటి సమస్య బాగా ఉంది. లో ప్రెషర్‌తో నీళ్ల వస్తున్నాయి. లైన్‌మెన్‌ను అడిగితే అధికారులతో మాట్లాడండి అంటున్నారు. అలాగే ప్యాచ్‌వర్క్‌లు కూడా చేయాల్సి ఉంది. – మహ్మద్ సర్ఫరాజ్, బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ మహ్మదీయ మసీదు కమిటీ అధ్యక్షుడు..

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రజని

పద్మారావునగర్: రాజ్యాంగం ద్వారా వచ్చిన హక్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ డిప్యూటీ తహసీల్దార్ రజనీ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ ఐడిహెచ్ కాలనీలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రంజనీ మాట్లాడుతూ.. హక్కులను సద్వినియోగం చేసుకుంటూ బాధ్యతలను కూడా పౌరులు నెరవేర్చాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఇతరత్రా వర్గాలకు రాజ్యాంగంలో అనేక హక్కులు పొందుపర్చారన్నారు. కులం పేరిట వివక్ష చూపినా, అంటరానితనాన్ని పాటించినా ...కులం పేరిట దూషించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎంఎం రాజు, రమేష్ బాబు, మధురవీరన్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన డిప్యూటీ మేయర్



విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం సందర్భంగా లాలాపేట మార్కెట్ స్కూల్లో(ప్రభుత్వ పాఠశాల) క్విజ్ పోటీలను నిర్వహించారు. దీంతో పాటుగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ విజ్ఞాన ప్రదర్శనను డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, మారెడుపల్లి జోన్ ఉప విద్యాధికారి సందర్శించి విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్‌ను తిలకించారు. విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, బి. తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

బన్సీలాల్‌పేట్: పద్మారావునగర్‌లోని సర్దార్‌పటేల్ కళాశాలలో జాతీయ సైన్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సై–రైజ్ 2025 పేరిట శిబిరం నిర్వహించారు. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సైంటిఫిక్ ఆఫీసర్ రజనీస్ దొంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్, ఎలోక్యూషన్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఎస్పీ కళాశాల పాలకమండలి చైర్మన్ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ కళాశాలలో జాతీయ సైన్స్ డే వేడుకలు..

ఘనంగా టైలర్స్‌డే



వేడుకల్లో భాగంగా వెల్లాల రామ్మోహన్‌ను సన్మానించిన దర్జీలు

సనత్‌నగర్: అంతర్జాతీయ టైలర్స్ డే వేడుకలను శుక్రవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. దర్జీలంతా ఒకచోట చేరి ఉల్లాసంగా గడిపారు. సనత్‌నగర్, ఎస్సార్‌నగర్ ప్రాంతాల్లోని టైలర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సందడి చేశారు. వేడుకల్లో బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను దర్జీలంతా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ రెడీమేడ్ రంగం వృద్ధితో టైలర్స్ ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఆధునిక మార్పులకు అనుగుణంగా టైలర్స్ కూడా తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

రిసాల బజార్‌లో క్లినిక్ సీజ్

రసూల్‌పురా: బొల్లారం రిసాలబజార్‌లో భవాని పాలీ క్లినిక్‌ను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఉమాగౌరి శుక్రవారం సీజ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే విధంగా క్లినిక్ నిర్వాహకులు భవాని వంశీ గౌడ్ జనరల్ ఫిజీషియన్‌గా కొనసాగుతూ శక్తివంతమైన యాంటీ బయాటిక్స్ ఇస్తున్నారని ఫిర్యాదులందాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ నిర్వహిస్తున్నందున సీజ్ చేశామన్నారు.

రాష్ట్రపతి నిలయంలో ముగిసిన సైన్స్ డే

రసూల్‌పురా: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బొల్లారం రాష్ట్రపతి నిలయంలో రెండు రోజుల పాటు జరిగిన సైన్స్ వేడుకలు శుక్రవారం ముగిసాయి. ప్రముఖ సైంటిస్ట్ షఫాలి టాండన్ ఇస్రో అంతరిక్ష పరిశోధనలు, విజయాలను భూమి పరిశీలన , కమ్యూనికేషన్, నావిగేషన్ ఉపగ్రహాల ప్రత్యేకతలను వివరించారు. నెక్ట్స్ స్కిల్స్ 360 వ్యవస్థాపకురాలు సౌజన్య సూరజ్ కంప్యూటర్లు, సాంకేతికత పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజని ప్రియా మాట్లాడుతూ రెండు రోజుల సైన్స్ ప్రదర్శనకు వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి ఐదు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు.



వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శన

ఏసీపీకి కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు



సనత్‌నగర్: అల్లం తోట బావి ప్రధాన రహదారిలో దశాబ్దాలుగా రోడ్డు మధ్యలో ఉన్న భారీ చెట్టుకు నష్టం వాటిల్లకుండా హైదరాబాద్ పబ్లిక్ స్కూలు ఆవరణలోకి తరలించడానికి కృషిచేసిన నార్త్ జోన్ ఏసీపీ శంకర్ రాజుకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఏసీపీ తన సొంత నిధులతో ఈ భారీ చెట్టును తరలించారు. కార్యక్రమంలో బేగంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బేగంపేట రమేష్ , పద్మారెడ్డి,ఎం సాంబయ్య, ఎస్ మహేష్,ఎం శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరం

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్, రెయిన్ బో హోమ్స్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ కేర్ అండ్ లర్నింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ కె. హేమలత ప్రారంభించారు. కార్యక్రమంలో రెయిన్ బో ఫౌండేషన్ ఇండియా ప్రొగ్రామ్స్ డైరెక్టర్ శ్రీలత, కో–ఆర్డినేటర్ క్రాంతికిరణ్, ఇన్‌చార్జీ సుజాత, సీబీసీ సంధ్యారాణి పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్

అడ్డగుట్ట: ప్రతీ ఒక్కరికీ పౌర హక్కులపై అవగాహన ఉండాలని మారేడుపల్లి మండల తహసీల్దార్ భీమయ్య గౌడ్ పేర్కొన్నారు. శాంతినగర్‌లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన తహసీల్దార్ భీమయ్య మాట్లాడుతూ పౌర హక్కులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అన్ని కులాల ప్రజలు తమ హక్కులను ఏ విధంగా సాధించుకోవాలనే విషయాలని వివరించారు. కార్యక్రమంలో యూసీడీ డీపీవో శ్రీనాథ్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, సీఓ శ్రీవాణి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం

- రూ.100 కోట్ల పన్ను వసూలుకు ప్రత్యేక బృందం
- డిప్యూటీ కమీషనర్ వి. సమ్మయ్య



పన్ను వసూలు చెక్కును డిప్యూటీ కమీషనర్ సమ్మయ్యకు అందజేస్తున్న సిబ్బంది

బన్సీలాల్‌పేట్: జీహెచ్‌ఎంసీ ట్యాక్స్ వసూళ్ల కార్యక్రమం బేగంపేట్ సర్కిల్ పరిధిలో ముమ్మురంగా సాగుతోందని డిప్యూటీ కమీషనర్ వి. సమ్మయ్య వెల్లడించారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బేగంపేట్ సర్కిల్ పరిధిలో నిర్దేశించిన రూ. 100 కోట్ల పన్ను వసూలుకు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ వేగవంతం చేశామన్నారు. ఇప్పటి వరకు రూ. 74కోట్ల ట్యాక్స్‌ను వసూలు చేశామన్నారు. మార్చి 31 వరకు మిగిలిన మొత్తం వసూలు చేసి లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా, నిబంధనలకు లోబడి చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నామన్నారు.

ఆస్తి పన్నుల పరిష్కార వేదిక..

ఆస్తి పన్ను వసూళ్లలో ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించడానికి వీలుగా తమ కార్యాలయంలో ప్రతి శనివారం ఆస్తి పన్ను సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య వివరించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మార్చి 1 నుంచి 29వ తేదీ వరకు ఆస్తి పన్నుల సమస్యల పరిష్కారం వేదిక పని చేస్తుందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదం సంతోష్‌కుమార్

లాలాపేట: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానికంగా నెలకొనే ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేయాలని సికింద్రాబాద్ అసెంబ్లీ ఇంచార్జి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు లాలాపేటలోని నఫీజ్ గార్డెన్‌లో తార్నాక డివిజన్ అధ్యక్షులు బ్రహ్మాజీ అధ్యక్షతన తార్నాక డివిజన్ బూత్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్థానికంగా ఉన్న పలు ప్రజా సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో చింతల్ కిట్టు, కిషోర్, అమర్‌నాథ్, ఐతం సంతోష్, చింతల నరేష్, సతీష్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో ఏప్రిల్ 23, 24, 25 తేదీలలో జరగనున్న జాతీయ స్థాయి కల్చరల్ టెక్నోస్మానియా 2К25 కార్యక్రమం బ్రోచర్, వాల్ పోస్టర్‌ను వీసీ ప్రొ.కుమార్ ఆవిష్కరించారు. శుక్రవారం వీసీ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్, టెక్నోస్మానియా కన్వీనర్ ప్రొ.శ్రీను నాయక్, డా.రాజం, డా.పరుశురామ్, డా.భాస్కర్, డా.సాదం ఐలయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

అడ్డగుట్ట: విద్యకు 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డగుట్టలో పాదయాత్ర నిర్వహించారు. తుకారాంగేట్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి మారేడుపల్లి మండల కార్యాలయం వరకు నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎంవి ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



విజయ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న ట్రాన్స్‌పోర్టు కార్మికులు

లాలాపేట: విజయ డెయిరీ ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అసోసియేషన్ నాయకులు టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డితో కలిసి ట్రాన్స్‌పోర్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రధానంగా విజయ డెయిరీ కాంట్రాక్టర్లు కొత్త రేటు ప్రకారం చెల్లించాలని కోరుతున్నారు.కానీ టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పాత రేటునే చెల్లిస్తున్నారని తెలియజేశారు. దీంతో తమకు అర్థికంగా నష్టపోతున్నామని, వాహనాల నిర్వాహణ, డ్రైవర్, క్లీనర్‌లకు జీతాలు చెల్లించలేకపోతున్నామని అన్నారు.

పుల్లయ్య.. నమ్మించి ముంచేశాడు

అమీర్‌పేట: చిట్టీలు వేసి అధిక వడ్డీ ఆశ చూపి 80 కోట్లకు పైగా కుచ్చుటోపీ పెట్టి పారి పోయిన చిట్టీల పుల్లయ్యపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. చిట్టీలు ఎత్తి నెలలు గడుస్తున్నా తమకు డబ్బులు ఇవ్వకుండా పారి పోయారని పుల్లయ్యతో పాటు ఆయన కుమారుడు రామాంజనేయులపై నలుగురు బాధితులు ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసినట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా చందన లక్ష్మింపల్లి గ్రామానికి చెందిన జి. పుల్లయ్య 20 ఏళ్ల క్రితం నగరానికి వచ్చాడు. దాసారం బస్తీ గుడిసెల్లో నివసిస్తూ తాపీ మేస్త్రీగా పనిచేస్తూనే చిట్టీల వ్యాపారం మొదలు పెట్టాడు. ఎస్‌ఆర్‌నగర్, బల్కంపేట, బీకేగూడ,సనత్‌నగర్ ప్రాంతాలకు చెందిన చెందిన దాదాపు 500 మంది వరకు అతడి వద్ద రూ.5 లక్షల నుండి కోటి రూపాయల వరకు చిట్టీలు వేశారు. అందరినీ నమ్మించి ఓ పెద్ద భవనాన్ని నిర్మించుకున్నాడు. బాధితులు చాలా మంది పనులు మానువేసి సీ–టైపు కాలనీలోని ఇంటి వద్ద పడిగాపులు కాస్తున్నారు.